

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

09 మే 2025 పేజీలు : 08 శుక్రవారం


### కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

## విజయవంతానికి కృషి చేద్దాం

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



7లో

### కూటమి ప్రభుత్వ పరిపాలన

## మరో ఎమర్జెన్సీ సూచిస్తుంది

**ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ఆరోపణ**

కూటమి ప్రభుత్వ పరిపాలన మరో ఎమర్జెన్సీ సూచిస్తుందని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు.



07లో

- ఘనంగా బ్రహ్మోత్సవ అంకురార్పణ
- గోనుపల్లిలో అంబరాన్ని అంటిన సంబరాలు
- నవ వధూవరులకు గిరిజనుల సారె
- ఉభయ దేవేరులతో కోనకు చేరిన నృసింహస్వామి



# గోవింద నామస్మరణతో మార్మోగిన కోన

రాపూరు, మేజర్‌న్యూస్ :

జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పెంచల కొన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అత్తారింటి నుంచి కొత్త అల్లుడు ఉభయనాంచారులతో కలిసి పెంచలకొన చేరడంతో పెనుశీల నరసింహుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పెళ్లికొడుకైన పెంచలస్వామి హిరణ్యకశిపుని వధనానంతరం ఉగ్రరూపుడైన స్వామివారు నరసింహ అవతారంలో వెలుగొండల్లో సంచరిస్తుండగా చెంచురాజు కుమార్తె చెంచులక్ష్మి చెలిమితో శాంతించారు. ఆమెను పెళ్లి చేసుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. అందువల్ల ప్రతి ఏడాది గోనుపల్లిలో పెంచల నరసింహస్వామి పెళ్ళి కొడుకై



ఉదయం గిరిజన కాలనీకి వచ్చారు. గోనుపల్లి గిరిజన కాలనీలో పెళ్లి సందడి నెలకొంది. గోనుపల్లిలోని పెంచలస్వామి ఆలయం లో ఉన్న ఉత్సవమూర్తులను దేవాదాయ శాఖ సిబ్బంది గిరిజన కాలనీకి తీసుకువచ్చారు. ఈ మార్గంలో శ్రీవారు పెంచలకొనకు బయల్దేరాల్సి ఉండటంతో దేవ దేవేరులకు తమ చెంతకు రాగానే గిరిజనకాలనీ వాసులు ఆతిథ్యం ఇచ్చి పూజలు నిర్వహించారు. గోనుపల్లి నుంచి పెంచలకొన వరకు పల్లకిలో కొలువుదీర్చి బోయలు మోసుకుంటూ తీసుకువచ్చారు. దేవస్థాన డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్య లు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, పోలీసులు, భక్తులు స్వామివారి పల్లకితో వచ్చారు.

-మిగతా 2లో

### వెంకటాచలం మండలంలో

## దారుణ హత్య



2లో..

### హాస్పిటల్, రాఫిట్ జిమ్ ప్రారంభించిన

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



2లో

### భగత్ సింగ్ కాలనీవాసులకు

## శాశ్వత పట్టాలు

**40 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన మంత్రి నారాయణ**



**40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నారాయణ శాశ్వత పరిష్కారం చూపారు. గత ప్రభుత్వం ఇచ్చిన దొంగ పట్టాలతో మోసపోయిన వారికి శాశ్వత పట్టాలు ఇప్పించేందుకు మంత్రి చేసిన భగీరథ ప్రయత్నం ఫలించి గురువారం క్యాబినెట్ ఆమోద ముద్ర పడింది. దీంతో నెల్లూరు సిటీలోని భగత్‌సింగ్ కాలనీలోని 1400 కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి.**

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీ వాసులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పెన్నానదీ తీరాన ఉన్న నివాసాలన్నంటికీ శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. త్వరలోనే 1400 కుటుంబాలు సీఎం

-మిగతా 2లో

### నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని

## ప్రత్యేక చర్యలు చేపట్టండి



2లో..

# వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చర్యలు చేపట్టండి

## కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కమిషనర్ వైఓ నందన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 30వ డివిజన్ వైయస్సార్ నగర్, మల్లయ్య గుంట, కేంద్రీయ విద్యాలయం, జర్నలిస్టు కాలనీ ప్రాంతాలలో కమిషనర్ గురువారం పర్యటించారు. స్థానిక ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకొని తాగునీటికి సంబంధించిన సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్ని డివిజన్లలో తాగునీటి చేతిబోర్ల పనితీరును పరిశీలించి, అవసరమైన వాటికి రిపేర్లు చేయించాలని సూచించారు. చేతి బోర్ల మరమ్మతులకు అవసరమైన స్పేర్‌పార్ట్స్, అదనపు సిబ్బందిని నియమించుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. చేతిబోర్లు అవసరం లేని ప్రాంతాలలో వాటిని పూర్తిగా తొలగించాలని తెలిపారు. అదేవిధంగా అన్ని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు వాటి కెపాసిటీకి తగినట్లుగా నిండేలా చర్యలు తీసుకొని, అనంతరం తాగునీటి సరఫరా చేపట్టాలని సూచించారు. వైయస్సార్ నగర్ పరిధిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా తాగునీటి ట్యాంకర్ల సరఫరా ప్రణాళికబద్ధంగా చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. మల్లయ్య గుంట ప్రాంతంలో నూతనంగా రోడ్లు, డ్రైన్ కాలువల నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. అదేవిధంగా డివిజన్ వ్యాప్తంగా ఉన్న పార్కులు, ఇతర కార్పొరేషన్ స్థలాలకు నేమ్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. అనంతరం స్థానిక 37వ డివిజన్ క్రాంతి నగర్ ప్రాంతంలో మాజీ మేయర్ భానుశ్రీతో కలిసి కమిషనర్ వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం 17వ డివిజన్ ఆకుతోట ప్రాంతంలోని డీఎస్‌కే గార్డెన్స్ తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి ఖాళీ స్థలాలను, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో మేజర్, మైనర్ డ్రైన్ కాలువల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని, వాటి నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు నివేదించాలని కమిషనర్ ఆదేశించారు. నగరవ్యాప్తంగా ఉన్న అన్ని పార్కులలో పచ్చదనం, పర్యావరణానికి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ తాగునీటి కుళాయిల ద్వారా నీటి వృధా కాకుండా అన్ని డివిజన్లలో పర్యవేక్షించాలని, అవసరం లేని ప్రాంతాలలోని పబ్లిక్ ట్యాప్లను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు శేషగిరిరావు, ఏఈ అర్చిత పాల్గొన్నారు.

# జేసీకి నుడా వీసీగా అదనపు బాధ్యతలు



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గతంలో నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న సూర్యతేజ ఇన్చార్జి నుడా వీసీగా ఉండి ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. దీంతో గత కొన్ని రోజులుగా నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ పోస్ట్ భర్తీకి నోచుకోలేదు. కనీసం ఎవరినీ ఇన్చార్జిగా కూడా నియమించలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న కార్తీక్‌ను నియమించింది. దీంతో నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులు.. జేసీ, నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ అయిన కార్తీక్‌ను గురువారం కలిశారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

## మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థకు చెందిన మున్సిపల్ కార్మికుల సమస్యల గురించి గురువారం ఏపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మేయర్ చాంబర్లో మేయర్ స్రవంతి జయవర్ధన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన మేయర్ మాట్లాడుతూ.. నగర పారిశుద్ధ్యంలో కార్మికుల కష్టమే కీలకమని తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని మేయర్ తెలియజేశారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన కోన



### గొల్లబోయికి తొలిదర్శనం..

పెనుశీల లక్ష్మీనరసింహస్వామి గ్రామానికి వచ్చిన తొలిసారి గొర్రెలకాపరికి తొలి దర్శనం ఇవ్వడంతో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోనుపల్లి సమీపంలోని గొల్లబోయిన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారు అప్పట్లో గ్రామానికి చేరుకున్నప్పుడు తమ మహిమలు గురించి గ్రామస్తులకు వివరించి తమకు ఆలయం నిర్మించమని చెప్పి వెనుతిరిగి చూడకుండా వెళ్లమని గొల్లబోయిని ఆదేశించారని పురాణాలు చెబుతున్నాయి. అయితే గొల్లబోయి వెనుతిరిగి చడడంతో శ్రీవారే గొల్ల బోయి శిలారూపం దార్చలని పురాణాలు తెలిపాయి.ఏటా శ్రీవారు సతీ సమేతంగా గొల్లబోయికి తొలి దర్శనమిచ్చిన అనంతరం కొనకు చేరుకుంటారు.

### గిరిజనులు సారె..

గోనుపల్లి గిరిజనకాలనీ కొత్త అల్లుడు రాకతో గిరిజనవాడలో సంబరాలు అంబరాన్నంటాయి. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు ఆచారం ప్రకారం పుట్టతేనె,ఇంజెటిగడ్డలు,నారె మొలతాడు సారెగా ఇచ్చారు. గిరిజన వాడలో ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక పందిళ్లు వేసి మధూవరులకు ఘన స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకున్న స్వామి అమ్మవార్లను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు గోనుపల్లి గిరిజనవాడకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. పల్లకిలో విశేష అలంకారణలో ఆశీనులైన స్వామి,అమ్మవార్లను చూసిన భక్తులు గోవింద నామ స్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

### కోనకు చేరిన శ్రీవారు..

గోనుపల్లి గిరిజనవాడ నుంచి ఉభయనాంచారులతో బయలుదేరిన శ్రీవారు పల్లకిలో కొనకు చేరుకున్నారు. గోవిందనామస్మరణ చేసుకుంటూ.. పెంచలకొనకు చేరుకున్నారు. ఆలయ ముఖ ద్వారం వద్ద ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు స్వామివారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హాస్పిటల్, రాఫిట్ జిమ్ ప్రారంభించిన

# ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో సురక్ష సూపర్ స్పెషాలిటి ప్రారంభమోహత్సవ కార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని బుచ్చి పట్టణ టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ల్యాబ్ తదితర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సురక్ష సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ నిర్వాహకులను సూచించారు. అనంతరం బుచ్చి పట్టణంలో రాఫిట్ జిమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బుచ్చి పట్టణ మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ ఛైర్మెన్ శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మి కాంతమ్మ, తాళ్ల వైష్ణవిలతో పాటు బుచ్చి మండల టీడీపీ నాయకులు బత్తల హరికృష్ణ, ఎంవీ శేషయ్య, విజం రామానాయుడు, టంగుటూరి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాచలం మండలంలో దారుణ హత్య

## భార్యపై అనుమానంతో.. నరికి చంపిన భర్త



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలంలోని అబ్బిసాహెబ్ కండిగ గ్రామంలో గురువారం తెల్లవారుజామున దారుణ హత్య ఘటన చోటు చేసుకుంది. భార్యపై అనుమానంతో భర్త కత్తితో నరికి హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. **వివరాల్లోకి వెళితే..** వామిటిపర్తి గ్రామానికి చెందిన పచ్చిపాల బాబు తన భార్య పచ్చిపాల భారతిపై గత కొన్ని రోజులుగా అనుమానం పెంచుకొని తరచూ గొడవపడుతున్నాడు. వేసవి సెలవుల కారణంగా కుటుంబం అబ్బిసాహెబ్ కండిగ గ్రామంలో నివసిస్తున్న బాబుకు మేనమామ ఇంటికి వచ్చింది. తెల్లవారుజామున సుమారు 1:30 గంటల సమయంలో, ఇంటి పైకప్పుపై కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో బాబు, భార్య భారతి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ వాగ్వాదం మితిమీరిన వేళ బాబు తలపాగా కింద దాచుకున్న మచ్చుకత్తితో భార్యపై దాడి చేసి నరికి చంపాడు. ఈ ఘటనను కుమార్తె పచ్చిపాల దీప్తి గమనించి అరవడంతో ఆమె సోదరి, మేనత్త మాండల కృష్ణవేణి పైకప్పుకు వచ్చి చూసే సరికి భారతి మృతి చెందింది. ఘాతకుడు బాబు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ సంఘటనపై దీప్తి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

# భగత్‌సింగ్ కాలనీ వాసులకు శాశ్వత పట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు అందుకోబోతున్నారు. వైఎస్ఆర్‌సీపీ ఇచ్చిన దొంగ పట్టాలతో మోసపోయామని ఎన్నికల ప్రచారానికి వెళ్లిన టీడీపీ అభ్యర్థి నారాయణకు స్థానికులు తమ గోడు వెల్లబోసుకున్నారు. అధికారంలోకి రాగానే అన్ని శాఖల అధికారులను సమన్వయ పరిచి పరిష్కరిస్తానని నారాయణ హామీ ఇచ్చారు. సమస్య రెండు శాఖలతో ముడిపడి ఉండటంతో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మంత్రులతో పలు దఫాలు చర్చించారు. సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి గ్రీన్ సిగ్నల్ ఇప్పించారు. క్యాబినెట్‌లో ఆమోద ముద్ర పడేలా చేశారు. విషయం తెలుసుకొన్న భగత్‌సింగ్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణకు జన్మజన్మలూ రుణపడి ఉంటామన్నారు. అదేవిధంగా భగత్‌సింగ్ కాలనీవాసులకు ఈరోజు ఒక పండుగ రోజని మంత్రి తెలియజేశారు. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కరించకుండా.. నేతలు కాలక్షేపం చేశారన్నారు. గత ప్రభుత్వం దొంగ పట్టాలు ఇచ్చి పేదలను మోసం చేసిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయంతో 1400 మంది పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయన్నారు. తెలుగుదేశం ఎప్పుడూ పేదల పక్షాన ఉంటుందన్నారు. మాటల ప్రభుత్వానికి చేతల ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసానికి ఇదే ఒక నిదర్శనమని మంత్రి నారాయణ అన్నారు.

# దళితుల జీవనోపాధిని కాపాడండి : కేవీపీఎస్



నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ : వుడ్ కాంప్లెక్స్‌కి పోయే దారిలో నివాసముంటూ జీవనోపాధిని కోల్పోయిన 25 దళిత కుటుంబాలను కేవిపిఎస్ జిల్లా కమిటీ నాయకులు పరామర్శించి మాట్లాడడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాల నుంచి దాదాపు 25 దళిత మాదిగ కుటుంబాలు వుడ్ కాంప్లెక్స్ ను నమ్ముకొని కాంప్లెక్స్ కు పోయే దారిలో పార్కు గోడను ఆనుకొని చిన్న చిన్న గుడారాలు వేసుకొని స్టూళ్లు బెంచీలు కత్తి పీటలు తయారుచేసి విక్రయించుకుంటూ తమ పిల్లలను చదివించుకుంటూ జీవించుచుంటారని. ఇదే వారికి జీవనాధారమని అయితే ఇటీవల వుడ్ కాంప్లెక్స్‌లోని యజమానులు వీరి పట్ల వివక్ష చూపించి వీరు వేసుకునీ నివాసం ఉంటున్న గుడిసెలను డ్రైనేజీ కాలవ నిర్మించే నెపంతో బలవంతంగా తొలగిం చి వేసినారు. దీనితో వీరందరూ తమ నివాసాన్ని ఉపాధిని కోల్పోయినారు. పక్కనే ఉన్న ఏపీఐఐసీ పార్కులో తాత్కాలికంగా ఉంటున్ననూ అక్కడకు పోయి కూడా వారిపై తమ ప్రతాపం చూపించి మహిళలు స్నానం చేసేందుకు వేసుకున్న పట్టలను కూడా తొలగించి నిలువ నీడ లేకుండా చేశారు. దీనితో వీరందరూ నిరాశ్రయులై బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్నారు. కాబట్టి సర్వస్వం కోల్పోయి ఉన్నవారి జీవనోపాధిని కాపాడాలని, దౌర్జన్యానికి పాల్పడిన వుడ్ కాంప్లెక్స్ యజమానులపై అట్రాసిటీస్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దేవతోటి సంపత్ పులిమి నరసింహారెడ్డి, స్థానికులు మన్నెం వెంకటేశ్వర్లు, మన్నెం తిరుపతయ్య, బుద్ధుల శివకృష్ణ, బుద్ధుల సురేష్, బుద్ధుల శివ, బి.ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై పశుదాణా.. రైతుకి ఇస్తుంది ధీమా




### దాణా వాడకం వలన ఎన్నో ఉపయోగాలు

ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ : గురువారం ఇందుకూరుపేట మండలం జగదేవి పేట పశు వైద్యశాల నందు 50శాతం రాయితీపై పశువులు దాణాను రైతులకి అందించడం జరిగింది. ఈ దాణా వేయటం వలన పాడి రైతులకు పాలు దిగుబడి పెరిగి పశువులు ఆరోగ్యంగా ఉంటుంది ఎండాకాలంపాలదిగుబడి తగ్గకుండా చేస్తుంది. ఇకనుంచి ఈ దాణాలు 3పశువులు ఉండే రైతులకు నెలకు మూడు బస్తాలు చొప్పున మూడు నెలలకు గాను 450 కేజీలు సరఫరా చేయబడును అని డాక్టర్ నాగేంద్ర తెలియజేశారు. జగదేవి పేట పశువైద్యశాల నందు రైతులకి పశు సంవర్ధక శాఖ నుండి రాయితీపై వస్తున్నటువంటి పలు కార్యక్రమాలు గురించి డాక్టర్ వివరిస్తూ మినీ గోకులం 90శాతం రాయితీ, పశుగ్రాస పెంపకం 100శాతం రాయితీ, పశుగ్రాస విత్తనాలు 70 శాతం రాయితీ, పశు బీమా 80 శాతం రాయితీ, పశు దాణా 50 శాతం రాయితీ కలిగిన ఈ అవకాశాలన్నిటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కూకటి వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ జి.నాగేంద్ర ఎల్లవేళలా రైతులకి అందుబాటులో ఉంటూ తగినవైద్యాన్ని అందిస్తూ ప్రభుత్వం నుంచి వచ్చేటటువంటి అన్నిరకాల కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ అక్కడ ఉన్నటువంటి నాయకులు, పాడి రైతులనుండి ప్రశంసలు పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూకటి వెంకటేశ్వర్ రెడ్డి, బొల్లినేని రవి నాయుడు, బాలబొమ్మ వెంకటేశ్వర్లు, పశు వైద్య సిబ్బంది డాక్టర్ జి.నాగేంద్ర, ఎల్ఎస్ఎ కరిముల్లా, వీఏ జ్యోతి, గోపాలమిత్ర సలాం, ఏహెచ్ ఏలు గీతమ్మ, శ్యామల, సురేఖ పాల్గొన్నారు.

# ఉగ్రవాద ముష్కరుల దాడులు అమానుషం



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : పాక్ ఉగ్రవాద ముష్కరుల దాడులు అత్యంత అమానుషం, దుర్మార్గమని, ప్రతీకారం అనివార్యమని నెల్లూరు డెల్టా హాస్పిటల్ ఎండి, ప్రముఖ పల్మానాలజిస్ట్ డాక్టర్ పోకల రవి పేర్కొన్నారు. ఆయన గురువారం సోమిశెట్టి మధుసూదన్ దశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. వారి కుటుంబానికి సంతాపం తెలియజేసి ధైర్యంగా ఉండమని డాక్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్ర మూకల ముష్కరదాడిలో అన్యాయంగా అశువులు బాసిన 27 మందికి ఘన నివాళులని, ప్రధాని మోదీ సారధ్యంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా చనిపోయిన వారి కుటుంబాలకు 15 రోజులలో పాకిస్తాన్ గడపలోకి పోయి ఉగ్ర మూకలను ఎరిపారేసి అత్యంత అద్భుతమైన నివాళి అర్పించడం భారత దేశ ప్రజలందరూ కూడా హర్షిస్తున్నారన్నారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం తీసుకోబోయే ప్రతి చర్యకు ప్రతి భారతీయుడు బాసటగా నిలబడేలా ఈ ఆపరేషన్ సిందూర్ జరిగిందని ఉగ్ర మూకలను తుదముట్టించి సరైన న్యాయం చేశారని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ భారత ప్రభుత్వానికి మోదీకి, పవన్ కళ్యాణ్‌కి బాసటగా నిలిచిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాపు బలిజ సంక్షేమ సేన నెల్లూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ సుధా మాధవ్ బెల్లపు, ఎలెక్ట్రికల్ ఏఈ మునిశేఖర్, ఏపీ కత్వా నాయకులు కమతం సుబ్బారావు, పామూరు మధుసూదన్, గునుకుల శివయ్య, హాజరత్తయ్య, గాదిరెడ్డి మురళీకృష్ణ, బీస్ నాయకులు బండి చలపతి, జనసేన నాయకుడు సమన వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ షాప్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కావ్య



కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణం ముసునూరులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సౌమ్య సోలార్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి బుధవారం పాల్గొన్నారు. సోలార్ ప్యానెల్స్‌ను పరిశీలించారు. సోలార్ వాడకం వలన కరెంట్ బిల్లులు తగ్గించుకోవచ్చని, ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. పర్యావరణానికి అనుకూలమైన సోలార్ వాడాలని ఎమ్మెల్యే తెలిపారు. షాపు యాజమాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజ్ కుమార్, ఉప్పుటూరి బాలగురుస్వామి, లింగం మాల్యాద్రి, బొట్లగుంట శ్రీహరి నాయుడు, బిట్రగుంట వెంకట్రావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ ఏపీఓగా ఉమామహేష్ బాధ్యతలు

ఉదయగిరి, మేజర్‌న్యూస్ : మండల జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథక ఇన్చార్జి ఏపీఓగా కేటీ ఉమా మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏమో కలిగిరి మండల ఏపీఓగా పనిచేస్తూ ఇక్కడ అదనపు బాధ్యతలు కేటాయిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీవో శ్రీనివాసరావు సస్పెన్షన్కు గురి కావడంతో ఉమా మహేష్ ను నియమించారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఉత్తరక్రియలలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య



కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణం మద్దూరుపాడు చెరువు నీటి సంఘం అధ్యక్షులు పిలిమిట్ల వెంకటేశ్వర్లు ఉత్తర క్రియల కార్యక్రమం కావలి పట్టణంలోని మద్దూరుపాడులోని వారి నివాసంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని ముందుగా వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, కొండా వెంకట్రావు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధుసూదన్ ఉత్తరక్రియలలో పాల్గొన్న ఎమ్మెల్యే



కావలి, మేజర్‌న్యూస్ : పహాల్గాం ఉగ్రదాడిలో మరణించిన కావలి పట్టణానికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావుకు కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి నివాళులర్పించారు. మధుసూదన్ ఉత్తరక్రియల కార్యక్రమం కావలి పట్టణంలోని ఏవీఎస్ కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని మధుసూదన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మధుసూదన్ నివాసానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, నున్నా మురళి, జనసేన నాయకులు సమ్మను వెంకట సుబ్బయ్య, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆక్రమిత పంట కాలవలను పరిశీలించిన అధికారులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని స్పార్క్ సిటీ వెనుకవైపున ఉన్న ఓబుల్ రెడ్డి నగర్ కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా మొత్తం ఎనిమిది సర్వే నెంబర్లలో 20 ఎకరాలలో 4 లేఔట్లను ఏర్పాటు చేశారు. ఈ అనుమతినేని అక్రమ లేఅవుట్లలో మున్సిపాలిటీ, హూడా, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలలో ఏ ఒక్కటి నుండి కూడా అనుమతులు లేకుండా ఈ లేఅవుట్లు వేసి ఉన్నారు. వ్యవసాయ భూములలో లేఔట్లు వేయడం వల్ల పంట కాలువలు కూడా ఈ లేఅవుట్ల లలో కలుపుకొని పూడ్చి వేయడంతో ఆత్మకూరు తో పాటు వెంకట్రావుపల్లి, నర్సాపురం తదితర గ్రామాలలో పంటల సాగుకు నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడి రైతులకు ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. తమ పంట కాలువను ఆక్రమించి లేఅవుట్లు వేస్తున్నారని ఈ ప్రాంత రైతులు పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. దీనిపై వీరికి మద్దతుగా సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నేత పందిరి సుబ్బయ్య, ఆత్మకూరు ప్రాంత నేత దీపోగు బాబు



జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో గురువారం రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు కాలవల హద్దులు నిర్ణయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పంట కాలువలు ఎంతవరకు ఉన్నాయో అంతవరకు హద్దులు నిర్ణయిస్తూ కర్రలను నాటారు. మరో రెండు రోజులపాటు పూర్తి సర్వే జరిపి నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తామని ఇరిగేషన్ ఏఈ రవికుమార్ రెడ్డి తెలిపారు..రైతాంగ సమస్య కావడంతో వారికి మద్దతుగా జిల్లా రైతు సంఘం నేత లక్కు ప్రసాద్ కూడా ఈ సర్వే లో పాల్గొన్నారు. పంట కాలవలు ఆక్రమణ పై ఫిర్యాదు ఇచ్చిన దీపోగు బాబు తో పాటు ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వో ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 24, 25 డివిజన్ వైసీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం, చింతరెడ్డిపాళెంలోని నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి నివాసం నందు 24వ డివిజన్, 25వ డివిజన్ నాయకులు, కార్యకర్తల తో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ నియోజక వర్గంలో ప్రతి ఒక్క వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నేను 24గం అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరితో నేనే టచ్ ఉంటాను పార్టీ పరంగా మీ ప్రతి సమస్యనినా సమస్యగా భావించి మీకు అండ దండగా ఉంటానని తెలియజేశారు. అనంతరం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 24వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా ఆది శేషారెడ్డిని నియమించారు. అలాగే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 25వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా షేక్ ఖాదర్ బాషని నియమించారు. ప్రతి ఒక్క నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ శ్యామ్ సింగ్, రాష్ట్ర అంగన్వాడి విభాగ కార్యదర్శి వెంకట్ జ్యోతి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ, ఎంప్లాయస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, మేధావి విభాగ అధ్యక్షుడు చంద్రమౌళి, 24వ డివిజన్, 25వ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బర్మాషల్ గుంట నిర్వాసితులకు అండగా ఆర్‌పీఐ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని రంగనాయకుల పేట రైల్వేగేట్ సమీప రైల్వే స్థలాలలో నివాసం ఉన్నవారికి నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా తొలగిస్తామని చెప్పడం అన్యాయమని ఆర్‌పీఐ పార్టీ జిల్లా నాయకులు తెలియజేశారు. గురువారం బర్మాషల్ గుంట వీధిలో పర్యటించి నిరుపేద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్‌కే మాబు మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ స్థలంలో నివాసం ఉన్నప్పటికీ వారికి నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా ఇల్లు తొలగించ కూడదు, కాదని అధికార అహంతో తొలగిస్తే ప్రభుత్వ అధికారుల మీద న్యాయ పోరాటం చేస్తామని ఆయన తెలియజేశారు. నిరుపేద దళితులు, ముస్లింలు 100 సంవత్సరాలకు పైగా ఈ ప్రాంతంలో నివాసం ఉన్నారని, అలాంటి వారిని దౌర్జన్యంగా తొలగిస్తామంటే ఆర్‌పీఐ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రంగ నాయకులపేట రైలు వీధి ప్రాంతంలో గత 100 సంవత్సరాలకు పైగా నివాసం ఉన్న నిరుపేదల వద్దకు వందలాది మంది పోలీసులు రైల్వే అధికారులు దౌర్జన్యంగా వచ్చి ఇల్లు తొలగిస్తామని



చెప్పడం చట్ట విరుద్ధమని అన్నారు. రైల్వే స్థలాలలో నివాసం ఉన్న బాధితులు అందరికీ పూర్తిస్థాయి విచారణ జరిపి ఒక్కో కుటుంబానికి 5లక్షల నష్టపరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో అత్యంత నిరుపేదలుగా ఉన్న దళితులు,ముస్లిం ప్రజలు బీడీ పని, చిన్నచిన్న కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు ఉన్నారని, అటువంటి బలహీనుల పట్ల నిర్లక్ష్య ధోరణి అధికార అహంతో వ్యవహరిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు జిల్లా ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్, దుంపల సుబ్బారావు, ప్రచార కార్యదర్శి ఉప్పల మాలకొండయ్య, సీనియర్ సిటిజెన్ కన్వీనర్ నిమ్మల సుబ్బయ్య, వజ్జా సుధాకర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సివిల్ కోర్టు వెకేషన్ జడ్జిల నియామకం

**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న సివిల్ కోర్టులకు వేసవి సెలవులను పురస్కరించుకొని జిల్లా సివిల్ కోర్టు జడ్జీలుగా ఇద్దరూ అదనపు జిల్లా జడ్జీలను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 12 నుండి జూన్ 13 వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అత్యవసర సివిల్ కేసులను వీరు విచారిస్తారు. జిల్లా సివిల్ కోర్టు వెకేషన్ జడ్జీలుగా ఆరవ అదనపు జిల్లా జడ్జ్, ఫ్యామిలీ కోర్టు జడ్జి నిఖిత ఆర్ ఓరాను, నెల్లూరు ఫోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జ్ సిరిపిరెడ్డి సుమను నియమించారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## థర్మల్ కేంద్రంలో మాక్ డ్రిల్ కార్యక్రమం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని నేలటూరు ప్రాంతంలోని దామోదరం సంజీవయ్య ఏపీ జెన్కో థర్మల్ కేంద్రం నందు గురువారం మాక్ డ్రిల్ జరిగింది. ఈ సందర్భంగా సంబంధిత ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రాజెక్టు అధికారులు సిబ్బంది హాజరయ్యారు. ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే క్రమంలో ఈ కార్యక్రమాన్ని అధికారులు చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఏ విధంగా ఉండాలి అనే విషయాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురు టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిక



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం చింతరెడ్డిపాళెంలోని, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి నివాసం నందు నెల్లూరు రూరల్ నియోజకవర్గం, 24వ డివిజన్ టిడిపి నాయకులు కొలను సుధీర్ రెడ్డి ఆనం విజయకుమార్ రెడ్డి నాయకత్వం మీద నమ్మకంతో స్వచ్ఛందంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వచ్చిన ఈ సందర్భంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మురళి యాదవ్, ప్రకాష్, వడ్లపూడి పెంచలయ్య, గడి నాగరాజు, ప్రేమ్ కుమార్, వెంకయ్య, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ సబ్సిడీ ఋణాలకు దరఖాస్తు చేసుకోండి : ఎంపీడీఓ ప్రసాద్



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఋణాలకు మైనార్టీలు, దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆర్థికంగా వెనకబడిన వారికి జీవనోపాధి కల్పించు నిమిత్తం 33, మందికి సబ్సిడీతో కూడిన బ్యాంకు ఋణాలు అందజేయుటకు ఈనెల 25వ తేదీ లోపల ముస్లిం, సిక్, బుద్ధిష్ట్, జైన్, పార్సి కమ్యూనిటీ వారు ఏపీఓబిఎంఎంఎస్, అంతర్జాలంలో నందు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. అలాగే సబ్సిడీ ఋణముల కోసం దరఖాస్తుదారుడు కులము సర్టిఫికేట్, పుట్టిన తేదీ సర్టిఫికేట్,రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, బ్యాంక్ పాస్బుక్, సెల్ ఫోన్ నంబర్ తీసుకుని ఆన్లైన్ సెంటర్స్ నందు గాని సమీప సచివాలయాలలో గాని దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు.

# తలసేమియా బాధిత చిన్నారుల జీవితంలో వెలుగును నింపుదాం




**కావలి, మేజర్‌న్యూస్ :** తలసేమియా బాధితులకు ఆశాకిరణం రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రం అని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌లో ప్రపంచ తలసేమియా దినాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యురాలు, న్యాయవాది గొట్టిపాటి మనోరమ చిన్నారులను షాపింగ్ మాల్‌కు తీసుకువెళ్లి వారు కోరిన రెడీమేడ్ దుస్తులను కొని ఇచ్చారు. అనంతరం రెడ్‌క్రాస్ తలసేమియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీరాం మనోహర్ బాబు, డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ రమ్య బాధిత చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో అత్యంత నాణ్యమైన సేవలు అందించే తలసేమియా ఆసుపత్రి ఏర్పాటు చేశామని అన్నారు. తలసేమియా చిన్నారులకు ప్రతీ 2, 3 వారాలకు ఒకసారి రక్తం ఎక్కించడం తోపాటు, ఉచితంగా మందులు, పౌష్టిక ఆహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. పలు ప్రైవేట్ ఆసుపత్రుల సహకారం అందిస్తున్నారని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో రక్తలేమితో ఉన్న పిల్లలను గుర్తించి, వారికి తలసేమియా పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. తలసేమియా బాధితులకు, వారి తల్లిదండ్రులకు రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు, తల్లిదం డ్రులకు బహుమతులు, దుస్తుల కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతి నిధులు, దాతలు, టీం సేవియర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలు ద్వారా ముగ్గురికి పోస్టింగ్‌లు

## జడ్పీ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ



**నెల్లూరు టౌన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్ రావుతో కలిసి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నందు కారుణ్య నియామకాలు కింద వెంకట రమణను మండల ప్రజా పరిషత్ బాలయపల్లికి, దాస్‌ను మండల ప్రజా పరిషత్ తడకు, వెంకట సాయి చరణ్‌తేజ మండల ప్రజా పరిషత్ తోటపల్లి గూడూరుకు ఆఫీస్ సబార్డినేట్‌గా గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఛైర్ పర్సన్ అయినా తర్వాత సెప్టెంబర్ 2021 నుండి ఇప్పటివరకు జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో 76 కారుణ్య నియామకాలు, 107 పదోన్నతులు కల్పించారు. ఇప్పటివరకు ఖాళీ ఉన్న పోస్టులను త్వరితగతిన భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు కే భీమిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మాభాష జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు కంచి ట్రస్ట్ ఆర్థిక సాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి ఒక్కొక్కరికి 10వేల వంతున మొత్తం 40వేలు నగదును దాతృత్వం చేశారు. 17 నెలలుగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి కర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న 10వేలు ఆర్థిక సహాయం కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో నిర్విరామంగా కొనసాగుతుంది. ఆత్మకూరు పట్టణంలోని 2వ వార్డు పరిధిలోని కప్పల పెంచలయ్య, షేక్ అమీర్ బి, 19వ వార్డు పరిధిలోని కప్పల కాంతమ్మ, షేక్ సంధాని, ఇటీవల కాలంలో మృతి చెందారు. ఈ కుటుంబాలను ప్రత్యక్షంగా పరామర్శించిన నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఒక్కొక్కరికి 10వేలు వంతున మొత్తం 40,000 ఆయా కుటుంబాలవారికి అంద చేశారు. ఈ సందర్భంగా కంచి పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఆ కుటుంబాలకు తానెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించాడు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎందరో తమ లాంటి పేదవారి ఆకలిని తీరుస్తూ అదే కాకుండా తమ కుటుంబ సభ్యులు మృతి చెందితే 10వేలు దాతృత్వం చేస్తున్న నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ వారి యొక్క దాతృత్వానికి ఇంటి పెద్ద దిక్కుని కోల్పోయి రేపు పెద్దకర్మకాండ ఎలా చేయాలో అర్థం కాని పరిస్థితిలో మీ రాక మీ సహాయం మా చీకటి బ్రతుకుల్లో ఒక వెలుగు అని కన్నీటితో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ 10వేలు ఆర్థిక సహాయం ఇప్పుడున్న ఈ కష్టాల్లో మాకు ఎంత పెద్ద మొత్తమో అర్థమవుతుందని, ఈ సహాయం మా జీవితకాలం గుర్తుపెట్టుకుంటామని, ఇదే కాకుండా ఈ కష్టకాలంలో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో డెత్ ఫ్రీజర్, కైలాస రథము, పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన మీకు జీవితకాలం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ ఆత్మకూరు పేద ప్రజల కష్టాలు తీర్చడానికి నేనున్నాను అంటూ మీరు మాకు అండగా నిలుస్తున్నారు మీలాంటి గొప్ప వ్యక్తి ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలని ఆ దేవుని ఆశీస్సులు మీకు, మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని ఆ దేవుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మన దేశంలోని ప్రసిద్ధ ఆట క్యారమ్స్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మనదేశంలో పుట్టి అభివృద్ధి చెందిన ఓపెన్ టేబుల్ గేమ్ క్యారమ్స్ అని గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య తెలిపారు. గురువారం గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిర కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన క్యారమ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. క్యారమ్స్ ఆట భారతదేశంలోని పాటియాలలోని ఒక రాజభవనంలో మొదలైంది అన్నారు ముందుగా గాజుతో చేసిన క్యారం బోర్డుతో ఈ ఆట ప్రారంభించారన్నారు. వివిధ పరిమాణాలు మరియు కార్నర్లు ప్యాకెట్ పరిమాణాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. క్యారం భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిందని అన్నారు. ఈ ఆటను అన్ని వయసుల వారు ఆడేందుకు ఆసక్తి చూపుతారన్నారు. ఈ ఆటల వల్ల మానసికమైన సంతోషం కాలక్షేపం జరుగుతుందని తెలిపారు. సరదాగా కాసేపు అనుకుంటూ ఈ క్యారమ్స్ ఆడినట్లయితే మనసు ప్రశాంతంగా ఉండి పనిచేస్తుందన్నారు. ఈ ఆటకు స్ట్రైకర్, గోలీలు ఉపయోగిస్తారన్నారు. ఆడేటప్పుడు మనసంతా ఆట పైనే కేంద్రీకరించి వ్యూహాత్మకంగా ఆడుతారని తెలిపారు. కాబట్టి విద్యార్థులు ఎప్పటి నుండే పలు రకాల ఆటలపై శ్రద్ధ చూపి నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

# ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం క్రిస్టియన్ పేట మొదటి లైన్‌లో డాక్టర్ కే.భానుప్రకాష్, డాక్టర్ కే.భావన, డాక్టర్ కే.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భాను ఆర్థో అండ్ చెస్ట్ వైద్యశాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి ప్రారంభించారు. పలు బ్లాక్ లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతి తక్కువ ఫీజుతో మెరుగైన వైద్య సేవలు అందించాలని, మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజ్ కుమార్, నున్నా మురళి, డాక్టర్ బెజవాడ రవికుమార్, డాక్టర్ సుబ్బారావు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి సిబ్బంది లక్ష్యాలను పూర్తి చేయాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఉపాది పథకంకు సంబంధించి సిబ్బంది కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీవో అప్పాజీ ఏపీవో కేటీ ఉమామహేష్‌లు పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో దినసరి కూలీల సంఖ్యను పెంపుదలు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెలాఖరులోపు సాధించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పని కల్పించాలన్నారు కూలీలకు క్షేత్ర సహాయకులు కొలతల ప్రకారం పనులు కేటాయించి గిట్టుబాటు కూలి నగదు పొందేలా చూడాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఈసీ సువార్తయ్య పాల్గొన్నారు.

# ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం

- అనధికారికంగా ఆక్వా సాగు చేస్తే కఠిన చర్యలు
- ప్రతి ఒక్కరూ లైసెన్సులు పొందాలి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల మత్స్య శాఖ అధికారి పొట్టయ్య పొట్టయ్య ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాలపై ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఏడి చాన్ బాషా పాల్గొని ఆక్వా రైతులకు పలు సూచనలు చేశారు. ఆక్వా రైతులు పలు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఆక్వా రైతులకు డ్రై మిషన్లను సబ్సిడీలో అందిస్తే ఫీడ్‌లను తయారు చేసుకుంటారని అధికారులను విన్నవించుకున్నారు. అనంతరం మత్స్య శాఖ ఏడి చాన్ భాషా మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న రిజిస్ట్రేషన్లనుపూర్తి చేసుకోవాలని ఆక్వా రైతులకు సూచించమన్నారు.మండల వ్యాప్తంగా, 700 ఎకరాలు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ వల్ల విద్యుత్‌లో సబ్సిడీ, పలు పథకాలులబ్ది చేకూరుతాయిఅన్నారు. అనధికారికంగాఎవరైనా ఆక్వా సాగు చేస్తే చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరు లైసెన్స్‌లు పొందాలని తెలిపారు. ఇప్పటికే తమ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆక్వా రైతులు చికెన్ వ్యర్థాలను ఉపయోగిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని లైసెన్స్ లను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

# అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోండి

## జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి సూచన

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** 2025-26 సంవత్సరానికి గాను ప్రభుత్వం వారు అన్నదాత సుఖీభవ పథకానికి మార్గదర్శకాలు విడుదల చేశారు. సంవత్సరానికి ఒక రైతు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 14వేలు కేంద్ర ప్రభుత్వం 6వేలు చొప్పున మొత్తం 20వేల రూపాయలు సాగు ఖర్చుల కొరకు జమ చేయడం జరుగుతుంది. ప్రతి రైతు సేవ కేంద్రంలో దీనికి సంబంధించిన డేటా వెరిఫికేషన్ 20.5.25 వరకు ఆన్‌లైన్‌లో అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో రైతు సేవ కేంద్రం సహాయకులు నమోదు చేయడం జరుగుతుంది. అన్నదాత సుఖీభవ స్కీము నందు ఒక సంస్థకు సంబంధించిన భూములు, రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు (జిల్లా పరిషత్ చైర్మన్, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీస్ మొదలైన వారు) ఉద్యోగస్తులు, రిటైర్ అయిన ఉద్యోగస్తులు, (పది వేల పైన పెన్షన్ తీసుకునేవారు) (4వ తరగతి ఉద్యోగస్తులు తప్ప) ఆదాయ పన్ను చెల్లించువారు, రిజిస్టర్ చేసుకుని ప్రాక్టీస్ చేస్తున్న వారు (వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్స్, ఆర్కిటెక్స్), నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ (హౌస్ సైట్స్)గా కన్వర్ట్ అయిన రైతుల భూములు (ఒకవేళ రెవెన్యూ రికార్డులో అప్డేట్ అయినా కాకపోయినా) ఈ అన్నదాత సుఖీభవ స్కీమ్‌కు అనర్హులు. వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్‌లో సాగు భూమి వున్న ప్రతి రైతు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు అవుతారు. అగ్రో ఫారెస్ట్రీ (సరుగుడు, జమాయిల్,ఎర్ర చందనం పెంపకం) ఉన్న పొలాలు అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులు అవుతారు.ఈ డేటా వెరిఫికేషన్ అనేది గ్రామస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ డేటా వెరిఫికేషన్ తర్వాత ఆర్‌టీజీఎస్ పోర్టల్‌లో డేటా రీ వాల్యు డేట్ అవుతుంది. ఫైనల్ లిస్ట్ మరల గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సహాయకులకు వస్తుంది. వారు ఫేషియల్ ఈ -కేవైసీ ద్వారా ఆయా రైతులను మరలా నమోదు చేసినట్లయితే వారు చివరకు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారు. కావున ప్రతి రైతు తమ తమ ఆధార్, భూమి వివరాలతో మీ పరిధిలోని రైతు సేవ కేంద్రం సహాయకులను కలిసి వివరాలను పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలియజేశారు.

# ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ ఛైర్మన్ వాకాటి విజయ కుమార్ రెడ్డి ఆదేశాలతో గురువారం ఉదయం నగరంలోని రెడ్ క్రాస్ కార్యాలయం నందు ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ కోశాధికారి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ మెంబర్ దాసరి రాజేంద్ర ప్రసాద్, ఎంఎస్‌ఆర్ స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపాల్ పి.గురునాధ రావు, డా.ఎస్.వరప్రసాద్, మెడికల్ ఆఫీసర్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్, నెల్లూరు విచ్చేయడం జరిగినది. ముందుగా రెడ్ క్రాస్ ఫౌండేర్ హెన్రి డ్యూనాంట్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రపంచంలో రెడ్‌క్రాస్, రెడ్ క్రెసెంట్ ఉద్యమాన్ని స్థాపించిన దివంగత జీన్ హెన్రీ డునాంట్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మానవత్వం యొక్క దృఢమైన స్ఫూర్తిని ప్రతిబింబించేల రెడ్ క్రాస్ వాలంటీర్లు, సిబ్బంది, భాగస్వాముల యొక్క అంకితభావం, నిస్వార్థ సేవను గౌరవిస్తు అభినందించారు. ఈ సంవత్సరం తమ థీమ్, 'మానవత్వం వైపు', రెడ్‌క్రాస్ ఉద్యమం యొక్క ప్రాథమిక సూత్రాలు : మానవత్వం, నిష్పాక్షికత, తటస్థత, స్వాతంత్ర్యం, స్వచ్ఛంద సేవ, ఐక్యత, సార్వత్రికతను సమర్థిస్తానని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి నెల్లూరు జిల్లా వాలంటీర్లు, సిబ్బంది, భాగస్వాములు ప్రతిజ్ఞను పునరుద్ధరించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్త దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.సాయిరాం, కన్వీనర్ వాలంటీర్లు, దాతలు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వీఎస్‌యూకి సాఫ్ట్ బాల్ ఛాంపియన్ కిరీటం

- ఘనంగా ముగిసిన టోర్నమెంట్
- ట్రోఫీలు, నగదు బహుమతులతో క్రీడాకారులకు సత్కారం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విజయం.. ఉత్సవం.. గర్వకారణం. ఇవన్నీ ఒక్కచోటే చక్కెర లాంటి మధురతను చేకూర్చాయి విక్రమ సింహపురి యూనివర్శిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలో ఐదు రోజులపాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో ప్రత్యర్థులపై దూకుడుగా ఆడిన ఆతిథ్య విక్రమ సింహపురి యూనివర్శిటీ జట్టు ఫైనల్‌లో రాజస్థాన్‌కు చెందిన మహారాజా సూరజ్ మల్ బ్రిజ్ యూనివర్శిటీని చిత్తుచేసి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది.

**విజేతల పరంపర :** మూడవ స్థానాన్ని కేరళలోని యూనివర్శిటీ ఆఫ్ కాలికట్ సొంతం చేసుకోగా, నాల్గవ స్థానంలో మహారాష్ట్రకు చెందిన సంత్ గాడ్గే బాబా అమరావతి యూనివర్శిటీ నిలిచింది.

**ట్రోఫీలు, నగదు బహుమతులు వర్షం :** ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. సోమిరెడ్డి తన సొంత నిధులతో నాలుగు జట్లకు రూ.1లక్ష నగదు ప్రోత్సాహకాలను ప్రకటించి అందజేశారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులకు సైతం నగదు బహుమతులు అందించారు.

**వికాసానికి పెద్ద దాతృత్వం :** వర్శిటీ ప్రధాన ఆర్చ్ నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.15లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఇప్పటికే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇచ్చిన రూ.58లక్షల నిధులతో నిర్మాణం కొనసాగుతుండగా, ఇప్పుడు ప్రకటించిన నిధులతో పనులు వేగవంతం కానున్నాయి.

**క్రీడల మహత్త్వంపై ఉపకులపతి సందేశం :** వర్శిటీ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో పాల్గొంటే శారీరకంగా, మానసికంగా సంపూర్ణంగా ఎదుగుతారని తెలిపారు. కరణం మల్లీశ్వరి, సచిన్ టెండూల్కర్ లాంటి ఆటగాళ్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని గుర్తు చేశారు. సోమిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో యువత క్రీడల ద్వారా మానసికంగా ధైర్యంగా ఉండాలని సూచిం చారు. 'ఈ వేదిక నుండి దేశ సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని చాటి చెప్పాలి' అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ ఆచార్య సీహెచ్ విజయ్, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్రాయులు, కోచ్‌లు, అంపైర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

- విజయవంతానికి కృషి చేద్దాం
- ఆలయంలో వీఐపీ కల్చర్‌కు చెక్ చెప్పండి.. అమ్మవారి ముందు అందరు సమానమే !
- సీసీ కెమెరాల సంఖ్య పెంచి ఆకతాయిల ఆగడాలు అరికట్టండి
- జొన్నవాడ పరిసరాలలో మద్యం విక్రయాలను నియంత్రించండి
- భక్తుల సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీ పడవద్దు
- వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైటింగ్, ప్రసాదాలు, తెప్పోత్సవ ఏర్పాట్లు
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవాలను అధికారులు, ఆలయ సేవా కమిటి సభ్యులు పరస్పర సమన్వయంతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ సందర్భంగా జొన్నవాడ విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఆలయ అర్చకులు, సేవా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆమె ఈనెల 17వ తేది నుంచి 27వ తేది వరకు జరిగే అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. 10 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వేలాదిగా హాజరయ్యే భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పోలీసు, రెవెన్యూ, ఎలక్ట్రిసిటి, ఫైర్, ఆర్‌టిసి లాంటి ప్రధాన శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. అందరు సమిష్టి కృషితో కష్టపడితేనే బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయగలమన్నారు. బ్రహ్మోత్సవాలలో ముఖ్యమైన రావణసేవ, నంసేవ, రథోత్సవం, కళ్యాణోత్సవం సందర్భంగా ఎంత మంది వస్తారనే విషయంలో దేవాదాయ శాఖ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. వేసవి సందర్భంగా భక్తుల దాహార్తి తీర్చేందుకు సురక్షిత తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. వేల సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని ఆలయ పరిసరాలలో షాపుల వారిని ఒప్పించి తాత్కాకంగా ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. పవర్ కట్ సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యను అధిగమించడానికి అవసరానికి సరిపడా జనరేటర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఫైర్ యాక్సిడెంట్ లాంటివి జరిగితే నివారించటానికి ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉంచుకోవాలని, స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు నివారించేందుకు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలాన్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వీలైనన్ని ఎక్కువగా మెడికల్ క్యాంప్స్ పెట్టండంతో పాటు అత్యవసర పరిస్థితులలో అంబులెన్సు అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పెద్ద సంఖ్యలో హాజరయ్యే మహిళలను దృష్టిలో ఉంచుకొని ఆకతాయిలు, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘాతో పాటు ఎక్కువ ఏరియా కవర్ అయ్యేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు. ఆలయ పరిసరాలలో మద్యం విక్రయాలు జరగకుండా ఎక్సైజ్ సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీఐపీల పేరుతో సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని ఆలయ అధికారులు, అర్చకులకు హితవు పలికారు. పార్కింగ్ సమస్యపై దష్టి సారించాలని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అధికారులు, ఆలయ సేవా కమిటి సభ్యులను కోరారు. కార్యక్రమలో ఆర్డీఓ అనూష, ఆలయ ఈఓ శ్రీనివాసులు రెడ్డి, సేవా కమిటి చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డితోపాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ పరిపాలన మరో ఎమర్జెన్సీ సూచిస్తుంది

## ఎమ్మెల్సీ పర్వత రెడ్డి ఆరోపణ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వ పరిపాలన మరో ఎమర్జెన్సీ సూచిస్తుందని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం సిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరుస కుంభకోణాలకు పాల్పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న వరుస కుంభకోణాలన్నీ పత్రికలు ప్రచురించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఒక పత్రిక ఎడిటర్‌ని నిర్బంధించి ఆయన ఇంట్లో పోలీ సులు సోదాలు చేయడం దుర్మార్గమైన విషయమన్నారు. పత్రికల్లో వార్తలు రాస్తే ఆ పత్రికల ఎడిటర్లను ఇలా దారుణంగా నిర్బంధించడం సరికాద న్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కక్షగా అభివర్ణించారు. ఇలాంటి దారు ణాలు చోటు చేసుకున్నప్పుడు ఈ సమాజం అసలు ఎక్కడికి పోతుందా.. అనే ప్రశ్న తలెత్తుతుందన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతిని, దోపిడీలను పత్రికలు ఖండించకుండా ఇంకెవరు ఖండిస్తారో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ రోజుల్లో ప్రతిపక్ష నాయకుల్ని నిర్బంధించి వారిని ఎలా హింసించారో మనం దరికీ తెలిసిన విషయమేనన్నారు. అధికార పార్టీ తెలుగుదేశం కూడా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి మద్దతుదారుకు సంబంధిం చిన ఇళ్ళలో సోదాలు జరిపి ఎవరో ఒకరి చేత అబద్ధపు వాంగ్మూలం ఇప్పించి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించడం మనందరం చూస్తున్నామన్నారు. అధికార పార్టీకి వత్తాసు పాడుతూ పోలీసులు కూడా అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి దుర్మా ర్గాలను చూస్తూ ప్రజలు కూడా ఈ రోజు సిగ్గుపడాల్సిన పరిస్థితులు తలె త్తుతున్నాయన్నారు. మరోపక్క దేశంలో పెహల్గాం లాంటి ఘటనలతో అమాయకులైన భారతీయుల ప్రాణాలను ఉగ్రవాదులు కబలిస్తూ దుర్మా ర్గానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద చర్యలకు దీటుగా ఆపరేషన్ సింధూర్ పేరుతో ముష్కర మూక లను అంతమంంచడంతో యావత్ భారతావని పండుగ చేసుకుంటుం దన్నారు. అయితే రాష్ట్రంలో మాత్రం దుర్మార్గమైన పాలన సాగుతుందని ఇది ఎప్పుడు అంతమవుతుందా.. అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్ని కుంభకోణాలు మరెక్కడా చోటు చేసుకోవడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2.49 పైసలకు విద్యుత్ కొనుగోలు చేస్తే టీడీపీ నేతలు గగ్గోలు పెట్టారని, మేము అధికారంలోకి వస్తే 1.99 పైసలకే విద్యుత్ కొనుగోలు చేస్తామని చెప్పి.. ఈనెల 2వ తేదీ యాక్సిస్ పవర్ కంపెనీతో ఒప్పందం పెట్టుకుని 4.60 పైసలకి యూనిట్ విద్యుత్తును కొనుగోలు చేయడాన్ని ప్రజలు చూస్తూ ముక్కును వేలేసుకుంటున్నారన్నారు. ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందం 11 వేల కోట్ల స్కాం అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచనే పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. నేడు సర్ చార్జీల పేరుతో ప్రజలపై 15వేల కోట్ల భారం మోపిందని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు ఒక్కొక్కటిగా తెలుసుకుంటున్నారన్నారు. ప్రతి మద్యం షాపులో 8 మందిని ఎంప్లాయిస్‌ని ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఎంపీ మిధున్ రెడ్డిపై కూడా అక్రమ కేసు బనాయించి, ఆయనకు ఈరోజు బెయిల్ రాకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఎంతో హుందా పరిపాలన అంంచేందుకు జగన్ మోహన్ రెడ్డికి సహాయపడిన ధనుంజయ రెడ్డిని, కృష్ణమోహన్ రెడ్డి లాంటి సివిల్ సర్వీసెస్ అధికారులను లిక్కర్ కేసులో అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఇలా కూటమి ప్రభుత్వం దారుణాలకు పాల్పడుతూ మీడియా గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తుందని చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు. ఇలాంటి దారుణాలు రాబోయే రోజుల్లో కూడా చోటు చేసుకుంటే.. భవిష్యత్తులో ప్రజలే రోడ్డుపైకి వచ్చి.. ఎదురు తిరిగి పోరాడే పరిస్థితి వస్తుందని కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.

## ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం వింజమూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులకు సంబంధించిన కిట్లను ఎక్కడ జాగ్రత్త చేస్తున్నారు, కార్యాలయంలో ఎంత మంది పని చేస్తున్నారు. ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం చాలా బాగుందని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు, విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## కెనరా బ్యాంకులో ఖాతాదారుల అవస్థలు




**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం కావలి యడవల్లి గ్రామంలో ఉన్న కెనరా బ్యాంక్, ప్రజలను అవస్థలు పెడుతుందని ఖాతాదారులు వాపోతున్నారు. ఈ బ్యాంక్ 14 గ్రామాల ప్రజలకు, రైతులకు, సేవలందిస్తుంది. ఖాతాదారులు పదుల కిలోమీటర్లు ప్రయాణించి పలు అవసరాల కోసం బ్యాంకు సేవల కోసం వస్తుంటారు. అయితే బ్యాంకు సిబ్బంది సమయపాలనతో అవస్థ పడుతున్నామని ఖాతాదారులు వాపోతున్నారు. అలాగే ఏమి అడిగినా సిబ్బంది స్పందించట్లేదని ఆవేదన వ్యక్తం చూస్తున్నారు. కొంతమంది ఖాతాదారులు అయితే బ్యాంకు సేవలు కోసం వచ్చి మధ్యాహ్నం భోజనం కోసం అల్లాడుతున్నామన్నారు. మరికొంతమంది భోజనం తెచ్చుకుని సాయంత్రం వరకు క్యూ లైన్లలో ఉంటున్నామని బ్యాంక్ ఖాతాదారులు తెలిపారు. అలాగే సంబంధిత అధికారులు స్పందించి బ్యాంకులో సరిపడా సిబ్బందిని ఖాతాదారుల సమస్యలను తొలగించాలని కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** తోటపల్లిగూడూరు మండలంలోని పేడూరు యూనిట్ మల్లికార్జునపురం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ప్రకృతి వ్యవసాయం పరిరక్షణ తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించి ఈ ర్యాలీ నిర్వహించారు. దీనికి సంబంధించిన అధికారులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్మార్ట్ విలేజ్ కమిటీ సభ్యులు దానయ్య, సునీత, కల్పన, స్థానికులు తాళ్లూరు జీవరత్నం, వార్డు సభ్యులు వీఏఏ ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పురాతన బావికి.. ఒక చరిత్ర ఉంది

- గతంలో ఈ భావినీళ్ళే గ్రామానికి ఆధారం
- మినరల్ వాటర్ వచ్చాక మరిచిపోయిన జనం
- సిద్దేశ్వర స్వామి ఆలయం భావినీరు తాగితే ఆ రుచే వేరు
- పూడిక తీత తీస్తే.. శుద్ధి జలాలు అందుబాటులోకి
- నిద్రావస్థలో ఆలయ ఉన్నతాధికారులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పూర్వీకులు నేలబావులు త్రవ్వకాలు చేశారు. ఆలయాలు, నివాస గృహాలు, పెరటి తోటలు, వ్యవసాయ భూముల్లో ఈనేల బావులు గతంలో ఉండేవి. ప్రకృతి సంపదగా భావించేటువంటి సమృద్ధి జలాలు అందుబాటులో ఉండేవి. బావుల్లో ఉండేటువంటి జలాలు స్వచ్ఛమైనవి. ఎలాంటి కెమికల్స్ లేకుండా ఈ నీళ్లు ప్రజలకు ఆరోగ్యాన్ని ఇచ్చేటివి. ఇలాంటి బావి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో కృష్ణపట్నం లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని దేవదాయ ధర్మదాయ శాఖ ప్రాచీన కాలం నాటి కామాక్షి దేవి సమేత మనుమ సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఉత్తరం దిక్కున పురాతన బావి ఉంది. ఎంతో సుదీర్ఘమైన దశాబ్దాల చరిత్ర ఉంది. శుద్ధి జల కేంద్రాలు అందుబాటులోకి రానంతవరకు శివాలయం భావినీళ్లు స్థానికులు ఉపయోగించేవారు. సూర్యరశ్మి కిరణాలతో స్వచ్ఛమైన నీళ్లు ఈ బావిలో ఉండేవి. ఈ నీళ్లు తాగితే ఆరోగ్యం అందం రెండూ ఉండేవి. కాలక్రమమైన బావి నీళ్లు తాగడం జనం మానేశారు. కెమికల్స్ తో కూడుకొని ఉన్న శుద్ధి జల కేంద్రాలు త్రాగడం మొదలుపెట్టారు. గతంలో ఈ బావినీరుజనం తాగేటప్పుడు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండేవి కావు. ప్రస్తుతం శుద్ధి జలాల వల్ల అనేక రోగాలు వస్తున్నాయి అని జనం అంటున్నారు.

### పూడిక తీత మరిచిపోయిన ఆలయ అధికారులు

కృష్ణపట్నం శివాలయంలో ఉన్న బావి ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. ప్లాస్టిక్ సంచులు, చిన్న చిన్న చెత్త వస్తువులు కనిపిస్తున్నాయి. ఈ విధంగా ఉండటంవల్ల నీరు దుర్వాసన వస్తుంది. కనీసం ఆలయ అధికారులు ఈ బావిలో పూడిక పనులు చేస్తామన్న ఆలోచన కూడా చేయలేకపోతున్నారు. దీనిపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ భావి నీళ్ళు త్రాగాలన్న ఆలోచన గ్రామస్తులకు ఉన్నప్పటికీ నీళ్లు బాగుండడం లేదు. కోట్ల రూపాయలు సంపద ఆలయం పనులకు నోచుకోవడం లేదు. ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ బావిలో పూడిక తీత పనులు చేస్తే నీటి జలాలు గ్రామస్తులకు అందుబాటులోకి వస్తాయని జనం అంటున్నారు.

### శృంగేరి పీఠాధిపతి కార్యక్రమానికి ఆహ్వానం

# నో.. నో.. అన్న ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఈనెల 18వ తేదీన ప్రతిష్టాత్మకంగా శృంగేరి పీఠాధిపతులను పిలిపించి మహోత్సవ కార్యక్రమాన్ని పునః ప్రతిష్టిం చేందుకు ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కావలి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంకి విరాళాలు అందించిన ప్రతి ఒక్కరిని ప్రేమ పూర్వకంతో కమిటీ సభ్యులు విడివిడిగా వెళ్లి ఆహ్వానిస్తున్నారు. అయితే కావలి పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షులు కన్యకా పరమేశ్వరి గుడికి 20 లక్షల రూపాయలు విరాళాన్ని అందించిన దాత తటవర్తి రమేష్‌కి బుధవారం ఆలయ కమిటీ సభ్యులు వారి గృహానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందించడంతో తన 'ఉగ్రరూపాన్ని' ప్రదర్శించి ఆలయ కమిటీ సభ్యులపై మండిపడ్డారు. కావలి పట్టణంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడిని నాకు ఆహ్వాన పత్రికను ఇప్పుడా ఇచ్చేది, నేను రాను.. నో.. నో.. అని తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించినట్టు విశ్వసినియ సమాచారం. అనంతరం ఆహ్వానానికి తమ ను ఆహ్వానించడానికి వచ్చిన ఆహ్వాన కమిటీ చేసేదేమీ లేక తిరిగి వెళ్ళడం జరిగిందని సమాచారం. కావలి పట్టణంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ ఏర్పడినప్పటి నుంచి కూడా ఈ కమిటీలో ఏదో ఒక గందరగోళం నెలకొల్తుందని సమాచారం. అయితే ఈ కమిటీ ఎన్నిక సక్రమమా.. అక్రమమా.. అనేది విశ్లేషకులు తమలో తాము ప్రశ్నించుకుంటున్నారు. అయితే అమ్మవారి గుడికి అందరూ సహకరించాలని, అది గుడికి సంబంధించిన విషయమని ఆర్యవైశ్యులు కులదేవతని ప్రజల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ దైవ సేవలో అందరూ తమవిభేదాలు పక్కనపెట్టి భక్తి, శ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తారా.. అని విశ్లేషకులు భావిస్తున్నారు. 20 లక్షలు విరాళాలు అందించిన కావలి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షునికి ప్రథమ స్థానం ఇవ్వకపోవడంతో తనుతోటి స్నేహితులతో తమ ఆవేదన వ్యక్తపరిచినట్లు సమాచారం. మరి ఏది ఏమైనప్పటికీ వీరి మధ్యలో ఉన్న విభేదాల వలన మే నెల 18న జరగబోవు మహోత్సవ కార్యక్రమానికి విజయవంతం చేస్తారా.. లేక మనస్పర్ధలతో ఆ కార్యక్రమానికి చెక్ పెడతారా.. ఎదురుచూడాల్సిందే.

# రెవెన్యూ సేవలను అందించడంలో జవాబుదారీతనం ఉండాలి : జేసీ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రెవిన్యూ సేవలను ప్రజలకు అందించే క్రమంలో జవాబుదారీతనం ఉండాలని అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. గురువారం తిక్కన ప్రాంగణంలో రీ సర్వే, డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్ను వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవిన్యూ సంబంధిత విషయాలపై నెల్లూరు డివిజన్ తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రీసర్వే ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా రెవిన్యూ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా ముందుగా రెవిన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న రికార్డుల జాబితా తయారు చేయాలన్నారు. నోషనల్ ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రైతుల వద్ద నుండి నీటి తీరువా పన్నును వసూలు చేయాలని, పన్ను చెల్లించకపోతే ఆయకట్టు విస్తీర్ణ కొలతల్లో తేడాలు వచ్చే అవకాశం ఉందని రైతులకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే వివిధ రకాల పౌర సేవలకు సంబంధించి ఆయా లబ్ధిదారులకు నేరుగా ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారన్నారు. అలాగే పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఉదయభాస్కరరావు, ఆర్డిఓ అనూష, సర్వే ఎడి నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### వింజమూరు ఉపసర్పంచ్ రాజీనామా



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన మీడదాల జయలక్ష్మి గురువారం తన రాజీనామా లేఖను ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డికికు అందజేశారు. వ్యక్తిగత కారణాలవల్ల తన బాధ్యతలను నిర్వర్తించలేకపోతున్నారని అందుచేత రాజీనామాను సమర్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. రాజీనామా లేఖను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని ఎంపీడీఓ తెలిపారు.

### శ్రీ బండాసురవధ అలంకారం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేటలో స్వయంభుగా వెలసిన శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నందు వసంతోత్సవంలో భాగంగా గురువారం శ్రీ బండాసురవధ అలంకారంలో దర్శనం ఇచ్చినారు. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా మాలకొండయ్య వ్యవహరించారు. ఈ వేడుకలు తిలకించడానికి భక్తులు భారీగా తరలి వచ్చినారు. దేవస్థానం వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### హుండీలు లెక్కింపు కార్యక్రమం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానము నందు గురువారం హుండీలు లెక్కింపు కార్యక్రమం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి సమక్షంలో హుండీలు తెరిచి భక్తులు శ్రీవార్లకు సమర్పించిన కానుకలను లెక్కించారు. తేదీ 26.03.2025 నుండి తేదీ 08.05.2025 వరకు అనగా 44 రోజులకు గాను శ్రీ వార్ల ప్రధాన ఆలయ హుండీలు ద్వారా ఆదాయం రూ.19,26,806/- భక్తులు శ్రీవార్ల హుండీ ద్వారా సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి, కార్యనిర్వహణాధికారి, శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం రంగనాయకులపేట నెల్లూరు, స్థానిక ఏపీజీ బ్యాంక్ అధికారులు, ఆలయ సిబ్బంది, విద్యాసాగర్ కృష్ణ అధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియారిటైర్డ్ ఉద్యోగులు, రెవిన్యూ అధికారులు, పోలీస్ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాత సుఖీభవ పథకానికి గుర్తింపు కార్యక్రమం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల్లో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత గల రైతుల గుర్తింపు ప్రక్రియ కార్యక్రమం చేపట్టినట్లు ఏడిఏ పి.చెన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్లాన్డ్ నందు భూమి కలిగిన రైతుల వివరాలను అన్నదాత సుఖీభవ వెబ్సైట్లో రైతు సేవ కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద అందుబాటులో ఉంచామన్నారు సీతారాం పురం మండలంలో 6003, ఉదయగిరి మండలంలో 8695, దుత్తలూరు లో 10374, వరికొండపాడు 10962, మర్రిపాడు మండలంలో 11415 మంది రైతుల భూమి వివరాలు ఆధార్ వివరాలు వెబ్సైట్లో ఉంచామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 20వ తేదీలోపు అర్హత గల రైతులకు గుర్తింపు కార్యక్రమం అయిన వెంటనే ఆర్బిజిఎస్ వారు అన్ని రికార్డులను ప్యూరిఫై చేసి వీఏఏలకు పంపుతారన్నారు. రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు.